

పెద్దకథ:

# వైకుంఠపాళి

'వింధ్యవాసిని'

అన్నిటికంటే నాకాశ్చర్యం కలిగించింది విజయ నాతో అంత ఆత్మీయంగా మాట్లాడటం. నా ముఖంలో ఆ ఆశ్చర్యం తనకి కనిపించిందేమో, తలవంచుకుని, "అంతా చెప్పారాయన. మిమ్మల్ని అనవసరంగా అపార్థం చేసుకున్నాను. నన్ను క్షమించరూ?" అంది. దాదాపు నలభై ఏళ్ళు దగ్గరపడుతున్న విజయ అలా చిన్నపిల్లలా అడుగుతుంటే నవ్వొచ్చింది. ఇంత బాగా అర్థం చేసుకోగలిగిన మనిషేనా అప్పుడపార్థం చేసుకున్నది అనిపించింది నాకు. మొదటే తన మనసు విప్పి చెప్పకపోవటం సత్యమూర్తి తప్పేనేమో అని తోచింది.

మేం వెళ్ళేసరికి సత్యమూర్తి తన పడకమీద పడుకుని, కళ్ళు తెరచుకుని అటూ ఇటూ చూస్తున్నాడు. ముఖమూ, పెదవులూ బాగా పాలిపోయి వున్నాయి. కళ్ళు రక్తమే లేనట్లు గాజుగోళాల్లా వున్నాయ్. చేతులూ, కాళ్ళూ—నరాలు, ఎముకలూ తేలివున్నాయి. జబ్బు—మనిషిని బాగా పీల్చేసినట్లుంది. అన్నీ తెలిసినవాడు ఎందుకింత నిర్లక్ష్యం చేసి ఇలా పీకల మీదకి తెచ్చుకున్నాడా అనిపించింది.

విజయ వెంబడి వస్తున్న నన్నుచూసి లేచి కూచోబోయాడు. కానీ వీలుకాలేదు. విజయ వెళ్ళి దిండ్లువేసి లేపి మెల్లిగా ఆన్చి కూచోబెట్టింది.

"బావున్నారా సీతా?" అనడిగాడు నీరసంగా. మేమిద్దరం ఎలా కలిసొచ్చామా అనే ఆశ్చర్యం వుంది అతని ముఖంలో. "ఒకమ్మాయిని చూడాలని హాస్పిటల్‌కి వచ్చాను. వెళ్ళిపోతూవుంటే మీ ఆవిడ కన్పించి చెప్పారు" అన్నాను.

"మాధవ ఎలా వున్నాడు?" అతనకి మాధవంటే ఎంత ప్రేమో నాకు తెలుసు. వాడు మాత్రం ఇతన్ని ఇంటికే రానియ్యొద్దని చెప్పాడు. వాడి క్షేమ సమాచారాలు ఈయనకి కావాలి. వాడికి మాత్రం ఈయన గుర్తైనా లేరు.

"బాగానే వున్నాడు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కి సెలక్ట్ అయి జాబ్ చేస్తున్నాడు. వాడు జాబ్‌లో చేరగానే నేను పని మానేశాను. ఈ వూళ్ళోనే వుంటున్నాం" అన్నాను.

"పెళ్ళి చేశారా?"

"ఇంకా కాలేదు. చేయాలని చూస్తున్నా. అన్నట్లు మీ అమ్మాయేదీ? ఏం చేస్తూంది తను?"

"ఈమధ్యే బియ్యే పాస్ అయింది. వూరికేవుంది." జవాబిచ్చింది విజయ.

ఇంక ఆగలేదు నామనసు. "ఏమిటి మూర్తీ? ఇలా అయిపోయారు ఎందుకింత నెగ్లెక్ట్ చేశారు? మీ ఆరోగ్యాన్ని మీరు జాగ్రత్తగా కాపాడుకోకపోతే ఎలా?" అన్నాను మందలిస్తున్నట్లుగా.

"ఏమిటోలెండి సీతా! అంతా అలా అయిపోయింది. ఏదో మామూలు కడుపునొప్పే అనుకున్నాను. ప్రతి చిన్న రోగానికీ డాక్టర్ల వెంట పడటం నాకు అసహ్యం. అంతేగానీ ఇలా ముంచుకొస్తుందనుకోలేదు....పోనీలెండి... నాకూ బ్రతకాలని పెద్ద ఆశగా లేదు....ఒక్కటే నా దిగులు....నేను పోతే

విజయకి బ్రతకగల ఆధారం—నా పెన్షనూ అవీ వస్తాయి. అయితే పాప పెళ్ళి ఎలా చేస్తుందా అనే ఎప్పుడూ భయం వేస్తుంది. నేనా ఉద్యోగం చేసి నన్నాళ్ళూ జీతమే తప్ప వేరుగా సంపాదించింది లేదు. కనీసం ఈపాటికి అమ్మాయి పెళ్ళయినా అయివుంటే నాకు సంతృప్తిగా వుండేది....పోనీంది. ఏం చేస్తాం? సంతోషంగా వెళ్ళిపోయేరాత నాకు లేదు....పోయేలోగా మిమ్మల్ని, మాధవనీ చూడాలని వుండేది....దేవుడే పంపించాడు మిమ్మల్ని ఒక్కసారి మాధవని వచ్చి పొమ్మని చెప్పమ్మా?....'' అన్నాడు ప్రాథేయ పడ్తున్నట్లుగా. అతనికి మామీదున్న అభిమానానికి నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

అతని సంతోషం కోసం ఏమయినాసరే చేయాలన్పించింది. కానీ నేనేం చేయగలను? ఏంచేస్తే అతనికి శాంతి కల్గించిన దాన్నవుతాను? అతను పోతే, విజయనూ వాళ్ళ కూతుర్నీ నాదగ్గరుంచుకుంటానని చెప్పనా? చెబితే మాత్రం విజయ వప్పుకుంటుందా—ముందే ఆమెకి స్వాభిమాన మెక్కువ.

హఠాత్తుగా ఏంచేస్తే బావుంటుందో స్ఫురించిందినాకు. మాధవకి, సత్యమూర్తి కూతురు ఉమని చేసుకుంటే బావుండదూ? దాంతో ఉమ పెళ్ళిదిగులూ తీరుతుంది. విజయకి మా ఇంట్లోవుండే అధికారమూ ఏర్పడుతుంది. ఈ అయిడియా బావుందన్పించింది. మాధవ నామాట కాదనడని తెలుసు. అందుకే ధైర్యంగా అన్నాను.

''మీరేం దిగులు పడొద్దు. అంతా నే చూసుకుంటాను. వీలయినంత త్వరలో ఉమకీ, మాధవకీ పెళ్ళి చేసేద్దాం. ఇంక ఏ సమస్యా వుండదు మీకిద్దరికీ, సరేనా?'' అన్నాను ఒక మంచి పనిచేసే అవకాశం వచ్చింది కదా అనే సంతోషంతో.

నేనలా అంటానని ఊహించి వుండని సంభ్రమం, సంతోషం ఇద్దరి ముఖాల్లో కన్పించాయి. ''థాంక్‌యూ సీతా! నా గుండెల మీంచి పెద్ద బరువు దింపేరు....కానీ మాధవని అడగకుండా మీరు తొందరపడు తున్నారేమో....'' అర్ధోక్తిలో ఆపేశాడతను.

''వాడి సంగతి మీకు తెలీదా మూర్తీ? నామాట కాదంటాడా వాడు. మీరలాంటి సందేహాలేం పెట్టుకోకండి. ఇవాళే వాడితో మాట్లాడి, రేపు మీదగ్గరికి తీసుకొస్తా. అమ్మాయిని కూడా తీసుకురండి విజయా—రేపు సాయంత్రం ఇక్కడికే.'' అని చెప్పి సెలవు తీసుకున్నాను.

## 23

''ఒకరి ఆనందం కోసం, మీ సుఖ సంతోషాల్ని సయితం పోగొట్టుకునే అలవాటు మీరెప్పుడు మానతారు సీతా!'' అన్న సత్యమూర్తి ప్రశ్నకి ఆలోచనలనించి తేరుకుని అతని ముఖంలోకి చూశాను.

''మరుసటిరోజు మాధవని తీసుకొస్తానని వెళ్ళిన మీరు పత్తా లేకుండా పోయారేం?''

జవాబు చెప్పలేక తల వంచుకున్నాను.

''హుఁ! మీకెందుకంత అభిమానం? మీరెంతమాట ఇచ్చినా, వాణ్ణి అడగకుండా చెప్పినదేకదా. దాన్ని పట్టుకుని ఆశపెట్టుకుని, ఆ ఆశ తీరకపోతే బాధపడేంత మూర్ఖుణ్ణి అనుకున్నారా నన్ను?''

అతని ప్రశ్నలు నన్ను దోషిని చేసి నిలబెట్టాయి. నేనేం సమాధానం చెప్పను? నిజమే. ఆ రోజలా తొందరపడి అతని అమ్మాయిని మాధవకి చేసుకుంటానని అనటం పొరబాటే. దాన్ని దిద్దుకునేదెలాగో తెలియకే కదూ నేను మళ్ళీ కనిపించకుండా పారిపోయింది.

ఆవేళ ఇంటికెళ్ళాక, ఈ విషయం ప్రస్తావిస్తే మాధవ అన్న మాటలు నాకింకా గుర్తే. ఎందుకంటే అవి శూలాల్లా నా గుండెల్లో గుచ్చు కున్నాయి కాబట్టి.

సత్యమూర్తిని ఏస్థితిలో చూసినదీ, అతనికేమని మాట ఇచ్చినదీ చెప్పాను మాధవకి. వాడేమీ మాట్లాడలేదు. రెట్టించి అడిగితే,

''ఏం? ఎవర్నయినా ప్రేమించావా బాబూ?'' అన్నాను అనునయంగా.

''అబ్బే లేదమ్మా'' అన్నాడు నసుగుతూ, అసలావిషయమై చర్చించటమే ఇష్టం లేనివాడిలా. వాడలా ఎందుకు దాటేస్తున్నాడో నాకు అంతు పట్టలేదు.

నిదానంగా ఆలోచించుకునేందుకు టయిము లేదు. అవతల సత్యమూర్తి ప్రాణం ఇవాళో రేపో అన్నట్లుంది. రేపు మాధవని తీసుకుని వస్తానని మాట కూడా ఇచ్చాను, వీడిలా నాన్చుతున్నాడేమిటా అని చిరాకేసింది.

''ఏమిటిరా నీ సందేహం? పరిస్థితి వివరించాను. ఎలాంటి పరిస్థితిలో ఈ మాట ఇచ్చిందీ చెప్పాను. నా మాట కాదనవనే నమ్మకమే నన్నిలా చేయించింది. ఇందుకు నీ అభ్యంతరం ఏమిటి?'' అన్నాను కాస్త కోపంగా.

''దయచేసి ఈ విషయంలో నన్ను బలవంతపెట్టకమ్మా'' అన్నాడు తల వంచుకుంటూ.

''హుఁ! ఈ విషయంలో నిన్ను బలవంతపెట్టరాదా? ఇంతదాకా ఎన్ని విషయాల్లో నిన్ను బలవంతం చేసి వప్పించానురా? నీవు చెప్పిందేది కాదన్నాను? నీ ఇష్టం లేకుండా, నా అభిరుచుల్ని ఎప్పుడూ నీ మీద రుద్దలేదే నేను. ఈ ఒక్కసారికి, చావు బతుకుల్లో వున్న అతనికి మాట ఇచ్చాను. ఆ మాటకి కట్టుబడలేవా నువ్వు? ఆయన మాత్రం పరాయివాడా? చిన్నప్పుడు ఆయనంటే ఎంత ఇదిగా వుండే వాడివి! ఈవేళ ఆయన కూతురు నీకు చేదయిందా?'' కోపంతో ఏం మాట్లాడుతున్నానో కూడా నాకు తెలియలేదు.

నా మాటలు వాడికి కోపం తెప్పించినట్లు ఎర్రబడ్డ కళ్ళే చెప్పాయి. మాటలు కూడబలుక్కుంటున్న వాడిలా నా ముఖంలోకి చూస్తూ—''నువ్వంతగా అంటున్నావు కాబట్టి చెబుతున్నా. చూడు మమ్మీ! ఆయనంటే నాకు అసహ్యం. నా చిన్నప్పటి మీ స్నేహాన్నిగూర్చి నలుగురూ ఏమనుకునే వాళ్ళో నాకు తెలీదనుకున్నావా? ఆయన కూతుర్ని నేనెలా పెళ్ళిచేసుకోను? మీకున్నా లేకపోయినా వావీ, వరసలు నాకున్నాయి'' అనేసి రివ్వున చెప్పులేసుకుని బయటికి వెళ్ళిపోయాడు. అవే వాడి నోటి నుండి నేను విన్న ఆఖరి మాటలు. ఆ నాలుగు మాటలు చాలవూ నన్ను జీవితాంతం శూలాల్లా పొడవటానికి?

కన్న తల్లిదండ్రులు విధిచేతిలో కీలుబొమ్మలై వీణ్ణి వంటరి చేసి

పోయినా నా ప్రాణంలా పెంచాను. చేయిపట్టి నడిపించే భర్త పోయినా, వీడికోసం ప్రాణాలు, ఆశలు నిలుపుకుని బ్రతికాను. కన్న కొడుకు కాక పోయినా, వాడితోడిదే లోకంగా జీవించాను. ఆఖరుకు ఇదీ వాడు నాకిచ్చిన ప్రతిఫలం! ఇంతకాలమూ జీవించి ఆఖరుకు కొడుకుచేత ఇంత నింద పడాల్సి వచ్చింది! నాదీ ఒక బ్రతుకేనా? అని తల బద్దలు కొట్టుకుని చచ్చిపోదామనిపించింది. వాడికి నా ప్రేమకంటే లోకులమాటలే విలువయినవని తెలిసిపోయింది. ఇంక వాడిముఖం చూడలేను. ఇవాళ్టితో వాడికీ నాకూ సరి. ఇంతవరకూ ఉన్నది చాలు. ఈరోజే వాడి జీవితం నుంచి నిష్క్రమిస్తాను అనుకుని, అందిన బట్టలు సర్దుకుని మా వూరికి బయలుదేరాను. అక్కడ ప్రత్యేకంగా నాకని రంగయ్యగారు రాసిచ్చిన ఇల్లొకటి వుంది. దాన్ని మాధవకివ్వనక్కర్లేదని వీలునామాలో రాశారు. అదిమాత్రం వుంచుకుని మిగతా ఆస్థి అంతా ఈ మధ్యే అమ్మేసి తెచ్చి మాధవ పేర బ్యాంకులో వేశాను. అక్కడ కొన్ని రోజులు గడిపి తరవాత ఏం చేయాల్సిందీ ఆలోచించుకో వచ్చని వెళ్ళాను.

"ఇవాళ్టితో నీకూ నాకూ సంబంధం తీరిపోయింది. జన్మలో మనం ఒకరి ముఖాలొకరు చూసుకోవటం జరగదు. ఒకవేళ నువ్వు నన్ను చూడాలని ప్రయత్నిస్తే నా శవాన్ని మాత్రమే చూడగలవు" అని ఒక ఉత్తరం రాసిపెట్టి బస్ ఎక్కాను. నేనెక్కడికెళుతున్నదీ రాయకపోయినా వాడు ఊహించగలిగాడు. అందుకే నేను వెళ్ళిన కొన్ని రోజులకే, "తను తొందరపడ్డాననీ తనని క్షమించి, తిరిగి రావాలని" రాశాడు. నేను దానికి జవాబియ్య లేదు.

వారం రోజుల్లోపలే మరో ఉత్తరం వచ్చింది. నన్ను చూడకుండా తను బ్రతకలేడట. తనేవచ్చి నన్ను తీసికెళతాడట. హుఁ! మాట అనటం సులభం, కానీ వెనక్కి తీసుకోవటం సాధ్యమేనా? వెంటనే రాసేశాను—నాకోసం వస్తే, నన్ను ప్రాణాలతో చూడ వీలుకాదు అని. తరవాతెన్ని జాబులు రాశాడో లెక్కలేదు. నేను వాటిని విప్పి చూడనూలేదు. జవాబులు ఇవ్వనూలేదు.

నేను మమకారం చూపుతూ వచ్చిన వారెవరూ నాకు దక్కకుండా, లోకాన్నే వదిలిపోయారు. ఆఖరికి వీడయినా వున్నాడంటే ఇలా బ్రతికుండీ లేనివాడయాడు. తల్లి అనే గౌరవమయినా లేకుండా అంతమాట అన్నాడు. అంతమాత్రం నా మనసుని అర్థం చేసుకోలేనివాడు నాకేం కొడుకు?

జీవితమంతా ఎవరో ఒకరికోసం, వారి సేవచేస్తూ బ్రతకటంలోనే గడిచిపోయింది ఇందాకా. ఇప్పట్నించయినా నాకోసం నేను జీవిస్తాను. నాకెవరితో సంబంధం వద్దు. మిగిలిన కాలమయినా ఆ పరాత్పరుడి సేవకై వినియోగిస్తాను. పుణ్యమయినా దొరుకుతుంది అనుకున్నాను. అంతే. డబ్బు కూడినప్పుడల్లా ఒకో తీర్థమూ, పుణ్యస్థలమూ, ఆశ్రమమూ దర్శిస్తూ వొచ్చాను. నా మనసుకెక్కడ ప్రశాంతంగా అనిపిస్తే అక్కడే వుండి పోవాలని నా ఉద్దేశం.

## 24

"ఏదో అలా జరిగిపోయింది. ఇచ్చిన మాట నిలబెట్టుకునే అదృష్టం నాకు లేకపోయింది. అవన్నీ ఇప్పుడెందుకుగానీ నాకు మీగురించి తెలుసుకోవాలనే ఆత్రుతగా వున్నది" అన్నాను.

"మీరలా దాటేస్తారనీ, తప్పు మీమీదే వేసుకుంటారనీ నేనెప్పుడో ఊహించాను. నాఊహే నిజమయింది."

"నేనప్పట్లో రెండుమూడేళ్ళుగా షిర్డి సాయిబాబా పూజ చేస్తుండే వాణ్ణి. ఒకసారి షిర్డికి వెళ్ళికూడా వొచ్చాను. మీరలా మాట ఇచ్చి వెళ్ళిపోయినరోజు రాత్రి సంతోషంగా ప్రశాంతంగా నిద్రపోయాను. కలలో షిర్డిబాబా కనిపించి, ఈ స్వామి దగ్గరకి వెంటనే ప్రయాణమయి వెళ్ళమని సూచనాప్రాయంగా చెప్పినట్టుగా అనిపించింది. ఉదయం ప్రయాణం పెట్టుకుందామంటే విజయ నెత్తీ నోరూ బాదుకుంది. ఈ పరిస్థితిలో ట్రీట్‌మెంట్ లేకుండా ఇలా ప్రయాణం చేస్తే నేనెక్కడ గుటుక్కుమంటానో అని తన భయం.

"నాకొచ్చిన కలవిషయం చెప్పి ధైర్యం చెప్పాను. అయేదెలాగూ కాక మానదు. అప్పుడో ఇప్పుడో పోయేవాణ్ణి ఆస్పత్రిలో పోయేబదులు, ఆశ్రమంలో ప్రశాంతంగా ప్రాణాలు వదిలితే అంతకన్నా అదృష్టం ఏముంటుంది—అని నచ్చజెప్పాను. ఆరోజు, మరునటి రోజు మీకోసం చూశాము. మీరు రాలేదు. మీ పరిస్థితి మాకర్థమయింది. ఇక ఆలస్యం చేయకుండా ప్రయాణమయి వచ్చాము ముగ్గురం.

"వచ్చినరోజే పలకరించారుస్వామి. నా ఆరోగ్యాన్నిగూర్చి పరామర్శించి, బెంగుళూరికి వెళితే నాకు ఆపరేషన్ చేస్తారనీ అంతా సరి అవుతుందనీ చెప్పారు. ప్రాణాల మీద పూర్తిగా ఆశ వొదులుకున్న నాకు చిన్న ఆశ కల్పించారు. ఆరోజు కల రావటం, నేను ఈ ఆశ్రమానికి రావటం, బెంగుళూరులో ఆపరేషన్ చేయించుకుని మళ్ళీ మామూలు మనిషిని కావటం అంతకంటే మిరక్యులస్‌గా జరిగాయి. ఎందుకంటే నా అదృష్టమేమో నేను అక్కడికి వెళ్ళినప్పుడే ఒక ఫారిన్ స్పెషలిస్ట్ ఆ హాస్పిటల్ విజిట్‌లో వుండటం, ఆయన నన్ను చూడటం తటస్థించాయి. ఆయనే చేశారు నాకు ఆపరేషన్.

"అటు తరువాత మా వూరికి వెళ్ళి వున్న భూములూ అవీ అమ్ముకుని హైదరాబాద్ వెళ్ళి చిన్నగా ఒక బిజినెస్ ప్రారంభించాను. బతికి బట్ట కట్టేక ఉదరపోషణ, సంసార పోషణ చేయాలిగా మరి. అనారోగ్యంతోనే వున్న ఉద్యోగం నుంచీ బలవంతంగా రిటైర్ అవాల్సి వచ్చింది.

"రోజుకి ఎన్నిసార్లు మిమ్మల్నీ, మాధవనీ అనుకునే వాణ్ణి. ముఖ్యంగా మాధవని చూడాలనే కోరిక నాలో బలంగా వుండేది. దేవుణ్ణి ప్రార్థించే వాణ్ణి.

"ఒకరోజు అనుకోకుండా వీధిలో ఒకచోట తారసపడ్డాడు. చిన్నప్పుడెప్పుడో చూశానేమో నేనసలు గుర్తుపట్టనేలేదు. వాడే గుర్తుపట్టి పలకరించాడు. 'బాగున్నారా అంకుల్?' అని. వెంటబెట్టుకుని ఇంటికి తీసికెళ్తే జరిగిన విషయమంతా చెప్పి కళ్ళనీరు నింపుకున్నాడు.

"అప్పుడలా తొందరపడి మాట అన్నా తర్వాత మీ పాత డైరీలు చదివితే అన్ని విషయాలు తెలిసాయి మాధవకి. పశ్చాత్తాప పడి మీకుత్తరాలు ఎన్ని రాసినా జవాబేలేదు. ధైర్యం చేసి మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తే, ఎన్నిసార్లొచ్చినా, మీరేదో ఒక తీర్థయాత్రలో వుండేవారు. ఇంక ఎక్కడని వెతుకుతాడు పాపం. ఇలా పిచ్చివాడయి తిరుగుతున్నాడు. ఆరునెలలు ఉద్యోగానికి సెలవు పెట్టేడట—మిమ్మల్ని వెతకాలని.

"మీరెక్కడున్నా చివరికి వాడ్ని క్షమించి రాకపోరని ధైర్యం చెప్పి తిరిగి ఉద్యోగంలో చేరమని పంపాను. అనుకోకుండా తనకి హైదరాబాద్ కే ట్రాన్స్‌ఫర్ అయింది. ట్రాన్స్‌ఫర్ అయి వొచ్చిన కొద్ది రోజుల్లోనే మాధవకీ ఉమకీ, పెళ్ళిచేశాను. మీరెక్కడున్నా తనని చూడకపోయినా, కనీసం ఆఖరుగా మీరు కోరిన కోరికయినా తీర్చి, మా అమ్మాయిని పెళ్ళిచేసుకుంటానని అతనే అడిగాడు. అంతకన్నా నేను మాత్రం కోరుకునేదేముంది?.

"పెళ్ళికి నెలరోజులు ముందే ఈ విషయాన్ని పేపర్లో వేయించాను. కనీసం మీరది చూసయినా వస్తారని ఎంతో ఆశ పెట్టుకున్నాం. కానీ మీరది కళ్ళతో చూడనయినా చూశారో లేదో మాకు తెలీదు. పెళ్ళినాటి కయినా మీరు రాకపోయేసరికి మాధవ చాలా బాధ పడ్డాడు.

"పెళ్ళయాక కూడా వాడు సంతోషంగా వున్నదే లేదు. మీ దిగులు తోనే మనిషిబాగా వీక్ అయిపోయాడు. ఏదో ఒక జబ్బు చేస్తుండేది తరచుగా. మొన్నామధ్య టైఫాయిడ్ వచ్చి పదిహేను రోజులు పడుకున్నాడు.

"మీరు కనిపిస్తే తప్ప మాధవ మనలో కలవలేడు. మీ ముఖం చూస్తేగానీ మామూలు మనిషి కాలేడు. మీరెక్కడున్నారో నని నాకు బెంగగానే వుండేది. ఆఖరికి ఈ స్వామి ఏమయినా దారి చూపుతారేమో నన్పించింది. ఇలా వచ్చాను. నేను చెప్పకుండా అయనే నాకోరిక తీర్చి, మిమ్మల్ని కనిపించేలా చేశారు నాకు." అని ముగించాడు సత్యమూర్తి.

అంత దాకా ఊపిరి బిగించి వింటున్న దాన్నల్లా ఇక ఒక్కక్షణ మయినా ఆగలేకపోయాను. నా సంతోషానికి అవధుల్లేకపోయాయి. వెను వెంటనే నా ప్రాణం, నా మాధవ ఎలాఅయిపోయాడా నా వల్ల—అని దిగులు వేసింది.

నా జీవితంలో నేను అహ్మద్ కన్నా, శైలజకన్నా ఎక్కువగా ప్రేమించి, అభిమానించింది మాధవనే. దానిక్కారణం పెంచిన మమ కారమే అనుకుంటాను. కనీసం నేను వాడి స్వంతతల్లిని కాదని తెలియటం నాకు ఇష్టం లేక, నేనెప్పుడూ ఆ విషయాలు చెప్పలేదు. ఇప్పుడు అంతా పోయి వుంటుంది. నా పిచ్చిగానీ, తెలిస్తే మాత్రమేం వాడికి నా మీదున్న ప్రేమ తగ్గుతుందా? పిచ్చితండ్రి నాకోసం ఎంత బెంగ పెట్టుకున్నాడు! తల్లికోసం తపించి, తల్లి దగ్గర చేసిన పొరపాటును దిద్దుకుని క్షమాపణ కోరుకునే కొడుకు వుండటం కంటే ఏ స్త్రీకయినా అదృష్టం ఏముంటుంది? వాడి ఉత్తరాలు కనీసం చదవకుండా నేనెంత పెద్ద పొరపాటు చేశాను?

నా మాధవని నేనే చేతులారా పోగొట్టుకునేదాన్ని—అదేముడి దయే లేకపోతే! అంతా ఆయన సంకల్పం కాకపోతే, నేనిలా సత్యమూర్తినీ ఆశ్రమంలో కలవటం చిత్రం కాదూ? స్వామి కావాలనే నన్నూ, సత్యమూర్తినీ ఒకేసారి తన దగ్గరికి రప్పించుకున్నారు. నా బాబునీ, నన్నూ కలపటానికి ఆయన చేసిన తమాషానే ఇది!

జరిగిన ఆలస్య మెలాగూ జరిగింది. చివరగా ఒక్కసారి స్వామిని దర్శించుకుని ఒకేసారి బయలుదేరదామనుకున్నాను—సత్యమూర్తి వెంట.

సాయంత్రం వెళ్ళి మందిరం దగ్గిర కూచున్నాను. ఎప్పటిలాగే చిరునవ్వులు చిందిస్తూ వెలుపలికొచ్చి అందరిమధ్యా నడుస్తున్నారు స్వామి. నా దగ్గరకొచ్చాక "ఏం బంగారూ? నీ కొడుకు దగ్గరికి రేపెళ్ళిపోతావా?" అని అడిగారు. నేను అడగకుండానే, వెళ్ళటానికి పర్మిషన్ ఇచ్చారనుకుని సంతోషించి, "అవును స్వామీ" అని చెప్పి, ఆయన పాదాలకి నమస్కారం చేసుకున్నాను. ఆయన మగవారి వయిపు వెళ్ళినప్పుడు సత్యమూర్తితో ఏవో మాట్లాడటం నేను గమనించాను.

## 25

మాధవకిప్పుడో కూతురూ, కొడుకూను. నేను తన దగ్గరికి వచ్చిన కొద్ది రోజుల్లోనే బాగా కోలుకున్నాడు వాడు. ఉమ కూడా చాలా మంచి పిల్ల. నేనంటే ఎంతో గౌరవం, అభిమానం చూపుతుంది. నాకిష్టం వచ్చినన్నాళ్ళు మనవడు, మనుమరాలితో సంతోషంగా, సంతృప్తిగా గడిపాను. ఇంక ఈ జీవితం చాలు, తిరిగి ఆశ్రమానికి వెళ్ళి అక్కడే వుండిపోదాము అన్పించింది.

నా నిర్ణయం విని ఉమా, మాధవా ఎంతో బాధపడ్డారు. నేను లేని లోటు పూరించుకోలేమని, నన్ను వెళ్ళొద్దని ఎంతగానో ప్రాథేయ పడ్డారు. నేను ఏదో వాళ్ళమీద కోపంతో వెళ్ళిపోవటం లేదనీ, ఆధ్యాత్మిక జీవితం నాకీ వయసులో అవసరమని నా మనసులో కలిగిన నమ్మకమే నన్ను పంపిస్తున్నదనీ నచ్చజెప్పి ప్రయాణ మయాను.

ఆశ్రమానికి వెళ్ళి స్వామి దర్శనం కోసం కాచుకుని కూచున్నప్పుడు ఆ రోజు స్వామి అన్న మాటలు గుర్తొచ్చాయి నాకు.

"చూడు బంగారూ! జీవి ఈ లోకంలో ఎప్పుడడుగు పెడతాడో అప్పుడే ఒక వైకుంఠపాళి ఆట మొదలవుతుంది. అలాంటి ఆటలో పాములనోట పడినప్పుడు అతిగా క్రుంగక పోవటమూ, నిచ్చెనలు ఎక్కినపుడు అతిగా పొంగిపోక పోవటమూ యోగులు చేసేపని. మామూలు వారు చేయనిది! చేయలేనిది మాత్రం కాదుసుమా! అయినా నువ్వు అడుగడుగునా కొంత నిగ్రహం చూపిస్తూనే వొచ్చావు. ఒకటి మాత్రం చెప్పగలను. నీ జీవితంలో నువ్వు దాటాల్సిన పాములన్నీ అయిపోయాయి. అయితే ఆఖరి నిచ్చెనని ఎక్కేసమయం ఇంకా రాలేదు. అప్పుడే ఆశ్రమ జీవితం కావాలని తొందరపడతావెందుకు? ఏ పనికయినా దాని సమయం రావాలి. అప్పుడే జరగాలి" అన్నారాయన అవాళ.

"నీ కొడుకుని పెంచి నువ్వేదో ఘనకార్యం చేశాననుకుంటావేం? నీ కన్నకొడుకయితే పెంచేదానివి కాదూ? నువ్వు తల్లివి కావాలనే కోరిక తీర్చుకోవటం వాడికి ఉపకారమెట్లా అవుతుంది తల్లీ!" అని మందలించి నా కళ్ళు తెరిపించి, నా అహంకారాన్ని అణిచేశారు. నిజానికారోజు సత్యమూర్తి కనిపించకపోయున్నా, నేనే మాధవని వెతుక్కుంటూ పోయుండేదాన్నేమో!

నా అదృష్టంకొద్దీ వచ్చినరోజే ఇంటర్వ్యూ దొరికింది.

వెళ్ళగానే "నీ కొడుకూ, అతని పిల్లలూ, భార్యా బాగున్నారా తల్లీ!" అని పరామర్శించారు.

మౌనంగా తలవూపిన నా వయిపు చూసి చిరునవ్వు నవ్వి, "భయపడొద్దులే. ఈసారి ఇక్కడే వుండిపోదువుగానీ, నువ్వు చెయ్యాల్సిన పనులన్నీ అయిపోయాయిగా!" అన్నారు చేయెత్తి ఆశీర్వదిస్తూ. నేను భక్తితో ఆయన పాదాల దగ్గర నాతల ఆన్చి కొన్ని క్షణాలపాటు వుండిపోయాను. ఆ క్షణంలో నిజమయిన ఆనందం అంటే ఇదేనేమో అనిపించింది నాకు.

[సమాప్తి]